ఎండిన పొలాల్లో కండ్లకు గంతలతో నిరసన

నీళ్లు లేక ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని గుడితండాలో ఎండిన వరి పొలంలో శుక్రవారం కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువుతోనే పొలాలన్నీ ఎండిపోయి రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. – తుంగతుర్తి

గంభీరావుపేటలో ఖాళీ బిందెలతో ధర్నా

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డు కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. తమకు తాగు నీరు అందించే బోరు బావిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయని, మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. – గంభీరావుపేట

రుణమాఫీ ఎప్పుడైతది?

సొసైటీ మహాజన సభలో రైతుల నిలదీత

సారంగాపూర్, ఏప్రిల్ 4: ప్రభుత్వ మేమో అందరికీ రుణమాఫీ చేసినమని చెప్తున్నది. మాకేమో ఇంకా మాఫీ కాలే.. మాకెప్పుడు రుణమాఫీ అయితదని రైతులు అధికారులను నిలదీశారు. నిజామాబాద్ జిల్లా సారంగపూర్ మండలం గుండారంలో చైర్మన్ శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సొసైటీ మహా జనసభకు తహసీల్దార్ అనిరుధ్, గిర్దావర్ హరీశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యంరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రుణమాఫీ ఏమైందని పలువురు రైతులు ప్రశ్నించారు. 'రుణమాఫీ అందరికీ వస్తుందని చెబుతుండ్రు. అడిగినప్పుడల్లా అప్పుడు ఇప్పుడు అంటూ కాలం గడుపుతుండ్రు. ఇది మీకు న్యాయమేనా' అని అధికారులను నిలదీశారు. ఒకరికి వస్తది.. మరొకరికి రాదా.. ఇదేం పద్ధతి అని నిట్టూర్చారు. ఇంకా కొంత మందికి రుణమాఫీ వచ్చేది ఉందని, మీకు కూడా అప్పుడే వస్తదని సొసైటీ సిబ్బంది సర్దిచెప్పేందుకు యత్నించారు. చేసేదేమీ లేక రైతులు మిన్నకుండి పోయారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రూప్లాతండాలో నేలకొరిగిన వరిని చూపుతున్న రైతు

మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో వర్షపునీటిలో మునిగిన మక్కలు చూపుతున్న రైతు

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో నేలకొరిగిన జొన్న చేనులో రైతు రాంలక్ష్మణ్

వరంగల్ జిల్లా భవానికుంటతండాలో నేలవాలిన వరిపొలంలో బాధిత రైతు

అకాల వర్షం...

- రాష్ట్రంలో పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
- చేతికొచ్చే దశలో పంటలకూ తీవ్రనష్టం
- తడిసిన పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనాలని అన్నదాతల వేడుకోలు

అన్నదాత ఆగమాగం

ములుగు జిల్లా గోవిందరావుపేటలో రాలిన మామిడిని చూపుతున్న రైతు

న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. పంటలు పెద్ద ఎత్తున దెబ్బతినగా, రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి నుంచి వీచిన ఈదురుగాలులకు చేతికొచ్చే దశలో ఉన్న పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పొలాలు నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. చేతికొచ్చిన మక్క, మిర్చి పంట నీటిపాలైంది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లోని కల్లాల్లో ఆరబోసిన మక్క తడిసి ముద్దయింది. మిర్చిపై టార్పాలిన్ కప్పినా ఫలితం లేకుండా పోయింది. కొత్తగూడ, గంగారం, నర్సింహులపేట, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, ములుగు జిల్లా గోవిందరావుపేట తదితర మండలాల్లో వరి, మక్క పంటలు నేలవాలాయి. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) నుంచి భద్రాచలానికి వెళ్లే రోడ్డులో రాళ్లవాగు వద్ద ఏర్పాటుచేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆర్టీసీ బస్సులను మణుగూరు, ఏటూరునాగారం మీదుగా మండల కేంద్రానికి తరలించారు. అకాల వర్షానికి తడిసిన మిర్చిని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎదుట బహుజన వాది డాక్టర్ వివేక్ ఆధ్వర్యంలో మిర్చి రైతులు ధర్నా నిర్వహించారు. మార్కెట్‌కు తెచ్చిన మిర్చి మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లిలో బొప్పాయి, మిరప, వరి పంటలు దెబ్బతిన్నాయి. గాలి దుమారంతో 30 ఎకరాల్లో బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి, పాల్వంచ, చండ్రుగొండ, చర్ల, దుమ్ముగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో వరి, మిర్చి పంటలు తడిసి ముద్దయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, తాంసి తదితర మండలాల్లో చేతికందిన జొన్న, మక్క, నువ్వు పంటలకు నష్టం వాటిల్లింది.

జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లిలో గాలివానకు దెబ్బతిన్న బొప్పాయి తోట

దెబ్బతిన్న పంటల నివేదిక తయారు చేయండి: తుమ్మల

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తేతెలంగాణ): వర్షాలతో దెబ్బతిన్న పంటలపై ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మార్కెట్లకు చేరుకున్న పంట ఉత్పత్తులను జాగ్రత్తగా కాపాడాలని సూచించారు.

'పుష్ప' టైటిల్ కహానీ!

'పుష్ప' ఫ్రాంఛైజీ చిత్రాలు రెండూ భారతీయ బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాలు దేశవ్యాప్తంగా రికార్డులను తిరగరాశాయి. పుష్పరాజ్ పాత్ర మాస్ ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అయింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాలో హీరోకి పుష్ప అనే పేరు ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయం గురించి దర్శకుడు సుకుమార్ ఆసక్తికరమైన వివరాల్ని వెల్లడించారు. తమిళనాడులో జరిగిన ఓ ఈవెంట్‌లో సుకుమార్ మాట్లాడారు. 'పుష్ప' సినిమాలోని హీరో పుష్పరాజ్ పాత్రను నిజమైన గంధపు చెక్కల స్మగ్లర్ నుంచి స్ఫూర్తిపొంది రూపొందించినట్లు చెప్పారు. 'ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఓ వెబ్‌సిరీస్ తీద్దామనుకొని పుష్పరాజ్ అనే స్మగ్లర్‌ను కలిశా. నాకెందుకో ఆ పేరు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. దాంతో అతన్ని ఇంటర్వ్యూ చేశాను. అదే పేరుతో సినిమా తీస్తే బాగుంటుందనిపించింది. సాధారణంగా 'పుష్ప' అనే పేరు మహిళలకు ఉంటుంది..కానీ ఓ స్మగ్లర్ అలాంటి పేరు పెట్టుకోవడం నన్ను ఆకర్షించింది అని సుకుమార్ తెలిపారు. ప్రస్తుతం సుకుమార్ మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

అనుక్షణం ఉత్కంఠగా 'లెవెన్'

నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేష్ అజ్ల్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అజ్మల్‌ఖాన్, రేయాహరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో నవీచంద్ర వపర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారని, ఓ కేసు శోధనలో ఆయనకు ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్న తీరు ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని, స్క్రీన్‌ప్లే ప్రధానంగా ఆకట్టుకునే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి డి.ఇమ్మాన్ సంగీతాన్నందించారు.

రాజమౌళి ట్వీట్ గుర్తింపు తెచ్చింది

'నరసింహా చారిగా ఓ చిన్నపల్లెటూరి నుంచి వచ్చిన నన్ను 'హృదయకాలేయం' సినిమాతో సంపూర్ణేష్‌బాబుగా మార్చారు దర్శకుడు సాయిరాజేష్. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను' అన్నారు నటుడు సంపూర్ణేష్‌బాబు. ఆయన హీరోగా సాయిరాజేష్ దర్శకత్వంలో రూపొందిన 'హృదయకాలేయం' సినిమా విడుదలై 11 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంపూర్ణేష్‌బాబు మీడియాతో ముచ్చటించారు. ''హృదయ కాలేయం' రిలీజ్ టైమ్‌లో రాజమౌళిగారు చేసిన ట్వీట్ వల్ల నాకు ఎంతో గుర్తింపు దక్కింది. ఎప్పుడు కలిసినా ఆయన 'సంపూ..ఎలా ఉన్నావు' అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు' అని చెప్పారు. ఈ 11 ఏళ్లలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చాలా చిత్రాల్లో నటించానని, ఈ నెల 25న 'సోదరా' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నానని సంపూర్ణేష్ బాబు చెప్పారు. మరో రెండు చిత్రాలు కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయని, కామెడీతో పాటు సీరియస్ క్యారెక్టర్స్ కూడా చేయాలన్నది తన అభిమతమని, తన లైఫ్‌స్టైల్‌కు సరిపడని వాతావరణం కాబట్టి బిగ్‌బాస్‌షో నుంచి మధ్యలోనే బయటకొచ్చానని ఆయన తెలిపారు.

హాయిగా నవ్వించి కష్టాలను మరిపించారు

'నవ్వించడం ఓ వరం. నవ్వు కష్టాలను మరిపిస్తుంది. ఈ సినిమా ఆ పనే చేసింది. ఆ విషయంలో దర్శకుడు కల్యాణ్‌శంకర్‌కి మనం థ్యాంక్స్ చెప్పాలి. సినిమాను హిట్ చేయడమే గొప్ప. దానికి సీక్వెల్ చేసి.. దాన్ని ఇంకా పెద్ద హిట్ చేయడం నిజంగా సామాన్యమైన విషయం కాదు. ఆ ఫీట్‌ను చేసిన దర్శకుడు కల్యాణ్‌శంకర్‌ను అభినందిస్తున్నా. ఇందులో పాత్రధారులంతా అద్భుతంగా నటించారు. కెమెరా, ఎడిటింగ్.. భీమ్స్ సంగీతం, కాసర్ల శ్యామ్ సాహిత్యం.. ఇలా ప్రతి క్రాఫ్ట్ ప్రాణం పెట్టి పనిచేశారు. ఇక నాగవంశీ.. మనిషి కరుకు, మనసు వెన్న. త్వరలో మేం కలిసి చేయబోతున్నాం. ఆ సినిమా గురించి తనే చెబుతాడు. ప్రశాంత్ నీల్ సినిమా తర్వాత 'దేవర2' కూడా ఉంటుంది. మీరు నాపై చూపిస్తున్న అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా ' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. నార్నె నితిన్, సంగీత్‌శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. బ్లాక్‌బస్టర్ 'మ్యాడ్' చిత్రానికి ఇది సీక్వెల్. కల్యాణ్ శంకర్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక, సాయిసౌజన్య నిర్మించిన ఈచిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన తారక్ పై విధంగా స్పందించారు. చిత్ర టీమ్‌కి దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అభినందనలు అందించారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులంతా మాట్లాడారు.

ఓమన్‌లో పుట్టిన రోజు వేడుకలు

కన్నడ భామ రష్మిక మందన్న వరుస విజయాలతో తారాపథంలో దూసుకుపోతున్నది. 'పుష్ప' ఫ్రాంఛైజీ, యానిమల్, ఛావా చిత్రాలు ఆమెకు దేశవ్యాప్తంగా తిరుగులేని పాపులారిటీని తెచ్చిపెట్టాయి. ఓ దక్షిణాది కథానాయిక అనతికాలంలోనే ఈ స్థాయి పేరుప్రఖ్యాతులు దక్కించుకోవడం అరుదైన విషమయని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలావుండగా నేడు రష్మిక మందన్న జన్మదినం. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నదీ భామ. అందుకు ఓమన్ దేశం వేదిక కానుంది. బిజీ షూటింగ్ షెడ్యూల్స్ నుంచి బ్రేక్ తీసుకున్న రష్మిక మందన్న ఇప్పటికే తన మిత్రబృందంతో కలిసి ఓమన్‌కు చేరుకుంది. ఫ్యామిలీ మెంబర్స్, కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో రష్మిక బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోనుందని తెలిసింది. ఇటీవల విడుదలైన 'ఛావా' చిత్రం అపూర్వ విజయంతో ద్విగుణీకృతమైన ఆనందంతో ఉంది రష్మిక మందన్న. దాంతో ఈ ఏడాది బర్త్‌డే చాలా ప్రత్యేకమైనదిగా భావిస్తున్నదట. ప్రస్తుతం రష్మిక తెలుగులో కుబేర, గర్ల్‌ఫ్రెండ్ చిత్రాల్లో నటిస్తున్నది.

చిత్రం

దేశభక్తి సినిమాల చిరునామా.. మూవీ లెజెండ్ మనోజ్‌కుమార్ కన్నుమూత

బాలీవుడ్‌లో విషాదం నెలకొన్నది. సుప్రసిద్ధ నటుడు, దర్శకుడు, నిర్మాత, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మనోజ్‌కుమార్ (87) శుక్రవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ముంబయి కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్‌లో ఆయన చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. దీంతో బాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మనోజ్‌కుమార్ 1937లో అభివక్త భారత్‌కు చెందిన అబోటాబాద్‌లో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించారు. మనోజ్‌కుమార్ అసలు పేరు హరికృష్ణ గోస్వామి. 1957లో 'ఫ్యాషన్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన ఆయన.. 'కాంచ్ కీ గుడియా' సినిమాతో నటుడిగా తొలి బ్రేక్‌ని అందుకున్నారు. కాలక్రమంలో దేశభక్తి సినిమాలకు చిరునామాగా నిలిచారు. దాంతో ఆయన్ను అభిమానులు 'భరత్‌కుమార్' అంటూ ప్రేమతో పిలుచుకునేవారు. అమితాబ్‌తో ఆయన తెరకెక్కించిన 'రోటీ కపడా ఔర్ మకాన్' చిత్రం 1974లో విడుదలై.. ఆ ఏడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. మనోజ్‌కుమార్ కెరీర్‌లోనే మెమరబుల్ మూవీ 'క్రాంతి'. ఈ సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించడమే కాక, లెజండరీ యాక్టర్ దిలీప్‌కుమార్‌తో కలిసి నటించి అఖండ విజయాన్ని అందుకున్నారు మనోజ్‌కుమార్. ఈ సినిమాకు మాటల రచయిత కూడా ఆయనే కావడం విశేషం. ఆయన హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'హూ కౌన్ థీ' ఒకటి. 1964లో విడుదలైన ఈ సినిమా దేశవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాను తెలుగులో 'ఆమె ఎవరు?' పేరుతో రీమేక్ చేశారు. 'ఉపకార్'(1967), 'పురబ్ ఔర్ పశ్చిమ్'(1970) వంటి క్లాసిక్స్‌ని ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. 40ఏండ్లకు పైగా సినీ పరిశ్రమకు సేవలందించి, ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించి, బాలీవుడ్ అగ్రహీరోలందరితో సినిమాలు రూపొందించి విజయాలను అందుకున్న మనోజ్‌కుమార్‌కి భారత ప్రభుత్వం 1992లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 2015లో ఆయన్ను దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం కూడా వరించింది. 1999లో వచ్చి 'జై హింద్' ఆయన చివరి చిత్రం. సుదీర్ఘ కెరీర్‌లో నటుడిగా, దర్శకుడిగా ఎన్నో అజరామరమైన చిత్రాల్ని అందించారు మనోజ్‌కుమార్. 'ఉప్‌కార్' (1967) దర్శకుడిగా ఆయన తొలి సినిమా. ఇందులో ఆయనే కథానాయకుడు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పాపులర్ స్లోగన్ 'జై జవాన్ జై కిసాన్' స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరాలను చర్చిస్తూ.. సైనికుడిగా మారిన ఓ రైతు స్ఫూర్తిదాయకమైన ప్రయాణానికి అద్దం పట్టిందీ చిత్రం. ఈ సినిమాకుగాను మనోజ్‌కుమార్ జాతీయ అవార్డును గెలుచుకున్నారు. 'ఉప్‌కార్' కంటే రెండేళ్ల ముందుగా వచ్చిన 'షాహిద్' చిత్రాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించారు. ఇందులో మనోజ్‌కుమార్ భగత్‌సింగ్ పాత్రను పోషించారు. ఈ సినిమా విజయమే ఆయన్ని దేశభక్తి ప్రధాన చిత్రాల రూపకల్పన వైపుకు నడిపించిందని చెబుతారు.

బిగ్గెస్ట్ మల్టీస్టారర్ హిట్ 'రోటీ కపడా ఔర్ మకాన్'

1974లో వచ్చిన 'రోటీ కపడా ఔర్ మకాన్' చిత్రంలో నటించడంతో పాటు దర్శకుడిగా, నిర్మాతగా బాధ్యతలు నిర్వర్తించారు మనోజ్‌కుమార్. ఇందులో అమితాబ్ బచ్చన్, జీనత్ అమన్, శశికపూర్ వంటి తారలు భాగమయ్యారు. దేశంలో ఆనాటి నిరుద్యోగం, అవినీతిని చర్చిస్తూ పర్‌ఫెక్ట్ ఇండియా ఎలా ఉండాలనే సందేశాన్ని అందించింది. ఈ సినిమాలో పాటలన్నీ ప్రజాదరణ పొందాయి.

దేశాన్ని ఉపేసిన 'క్రాంతి' మేనియా

మనోజ్‌కుమార్ కెరీర్‌లో బెస్ట్‌మూవీగా 'క్రాంతి' నిలిచింది. దిలీప్‌కుమార్, శత్రుఘ్నసిన్హా, హేమామాలిని, శశికపూర్ వంటి అగ్ర తారలు ఇందులో నటించారు. 19 శతాబ్దం నాటి స్వాతంత్ర్య పోరాటం నేపథ్య కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం కల్ట్‌ఫిల్మ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. దేశంలోని అనేక కేంద్రాల్లో సిల్వర్‌జూబ్లీ వేడుకల్ని జరుపుకుంది. ఈ సినిమా విడుదల తర్వాత ఆనాటి యువత క్రాంతి పేరుతో ఉన్న టీ షర్టులు, బనియన్లు ధరించారంటే సినిమాకు ఎంతటి క్రేజ్ దక్కిందో తెలుసుకోవచ్చు. కెరీర్ ఆరంభంలో రొమాంటిక్ హీరోగా పేరు తెచ్చుకున్న మనోజ్‌కుమార్ తర్వాత కాలంలో దేశభక్తి ప్రధాన చిత్రాలకు చిరునామాగా నిలిచారు. 1977 ఎమర్జెన్సీ టైమ్‌లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి ఓ సినిమాను తీసేందుకు ప్రయత్నాలు చేశారు మనోజ్‌కుమార్. అయితే రచయితలు సలీమ్-జావెద్‌తో వచ్చిన సృజనాత్మక విభేదాల కారణంగా ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. సాంఘిక చిత్రాలను కూడా చక్కటి విలువలు, సంస్కృతికి పెద్దపీట వేస్తూ తెరకెక్కించారాయన. షాహీద్, వో కౌన్ థీ, హరియాలీ ఔర్ రాస్తా, ఉప్‌కార్, పురబ్ ఔర్ పశ్చిమ్, గున్మమ్, రోటీ కపడా ఔర్ మకాన్, క్రాంతి వంటి చిత్రాలతో ఆయన భారతీయ సినిమాలో చిరస్థాయిగా నిలిచిపోయారు. దేశానికే గర్వకారణమైన చిత్రాలను రూపొందించిన మూవీ లెజెండ్ మనోజ్‌కుమార్ మరణం భారతీయ సినిమాకు నిజంగా తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.